# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 07.01.2025 | 24 క్యారెట్లు 78,457.00 | కిలో వెండి 99,612.00 | 31 ℃ | సంపుటి:3 | సంచిక:77

www.vishalabharati.com




## రాష్ట్రంపై చలి పంజా

- కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు
- రానున్న ఐదు రోజులు మరింత తీవ్రం
- వాతావరణ శాఖ అధికారుల హెచ్చరిక

# దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ భయం..!

- చైనా కొత్త వైరస్ వ్యాప్తితో ప్రజల్లో టెన్షన్
- ఒకే రోజు వరుసగా 6 కేసులు
- చాపకింద నీరులా వ్యాపిస్తున్న హెచ్‌ఎంపీవీ
- ఇప్పటికే చైనాలో మృత్యుఘోష
- పలు పట్టణాల్లో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు
- భయపడాల్సిన పనిలేదంటున్న కేంద్ర ప్రభుత్వం
- ట్విట్టర్‌లో ట్రెండ్ అవుతున్న లాక్‌డౌన్






"లాక్‌డౌన్.. ఈ పేరు చెబితేనే సాధారణ ప్రజల్లో ఏదో తెలియని భయం. సరిగ్గా ఐదేళ్ల క్రితం కళ్ల ముందు మెదిలిన ఘటనలను ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేదు. కరోనా సమయంలో ఇళ్లకే పరిమితమై ఎలాంటి ఇబ్బందులు పడ్డారో చెప్పనవసరం లేదు. ప్రస్తుతం దేశంలో చైనా కొత్త వైరస్ వ్యాప్తితో మరోసారి లాక్‌డౌన్ తప్పదా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతోందని ప్రజలు భయపడుతున్నారు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రస్తుతం చైనా దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న హ్యూమన్ మెటాప్ న్యుమో వైరస్(HMPV) మనదేశంలోకి కూడా ప్రవేశించింది. ఈ వైరస్ గురించి ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర వైద్యారోగ్యశాఖ ఓ ప్రకటన విడుదల చేసిన కొద్ది గంటల్లోనే మన దేశంలో తొలి కేసు నమోదైంది. హెచ్‌ఎంపీవీ వైరస్ తొలి కేసు కర్ణాటక రాజధాని బెంగళూరులో నమోదైంది. బెంగళూరులో 8 నెలల చిన్నారి అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు హాస్పిటల్ కు తీసుకెళ్లారు. డాక్టర్లు టెస్టులు చేయగా ఆ చిన్నారిలో HMPV వైరస్ కనుగొనబడింది. దీంతో వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు అలర్ట్ అయ్యారు. తాజాగా చెన్నైలో మరో ఇద్దరు చిన్నారుల్లో ఈ వైరస్‌ను గుర్తించారు. దీంతో దేశంలో మొత్తం హెచ్‌ఎంపీవీ కేసుల సంఖ్య 6కి చేరింది. బెంగళూరులో వైరస్ సోకిన మూడు నెలల చిన్నారి కోలుకుంది. ఆస్పత్రి నుంచి కూడా డిశ్చార్జి చేశారు. మరో 9 నెలల చిన్నారికి ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. అలాగే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 2 నెలల చిన్నారి, కోల్‌కతాలో 5 నెలల చిన్నారిలో కూడా ఈ వైరస్‌ను గుర్తించారు. తాజాగా చెన్నైలో ఇద్దరు చిన్నారులకు ఈ వైరస్ సోకినట్లు వైద్యులు ప్రకటించారు. ప్రస్తుతం వీళ్లకు చికిత్స జరుగుతోంది.

**భయం లేదంటున్న ఐసీఎంఆర్**

హెచ్‌ఎంపీవీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR) కీలక ప్రకటన చేసింది. ఈ వైరస్ భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే వ్యాప్తిలో ఉందని తెలిపింది. వివిధ దేశాల్లో హెచ్‌ఎంపీవీతో సంబంధం కలిగిన శ్వాసకోస వ్యాధుల కేసులు నమోదైనట్లు చెప్పింది. ఇలాంటి కేసులు భారత్‌లో పెరిగినా ఎదుర్కునేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. కేంద్ర ఆరోగ్యశాఖ కూడా ఈ పరిస్థితిని పర్యవేక్షిస్తోందని స్పష్టం చేసింది. మరోవైపు హెచ్‌ఎంపీ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ కొత్తదేమి కాదని గతంలో కూడా ఇలాంటి హెచ్‌ఎంపీవీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. జులై లేదా ఆగస్టు నుంచి డిసెంబర్ లేదా జనవరి వరకు ప్రతీ ఏడాది ఈ కేసులు వస్తాయన్నారు. దగ్గు, జలుబు, జ్వరం లాంటి సాధారణ లక్షణాలే ఉంటాయని.. చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే దీని తీవ్రత పెరిగినప్పుడు ఆక్సిజన్ అందించాల్సి ఉంటుందని తెలిపారు.



## భారత్ కు బుల్లెట్ రైలు..!

- దేశంలో కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం
- ప్రతి రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి జరుగుతోంది
- నాలుగు విభాగాల్లో రైల్వేను అభివృద్ధి చేస్తున్నాం
- మౌలిక సదుపాయాల కల్పనకు యజ్ఞం
- వర్చువల్‌గా చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

దేశంలో కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలోనే భారత్ కు బుల్లెట్ రైలు సాకారం అవుతుందని అన్నారు ప్రధాని మోడీ. దేశంలో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన కోసం యజ్ఞం జరుగుతోందని, బుల్లెట్ రైలు పరుగులు పెట్టే చారిత్రక రోజు దగ్గర్లోనే ఉందని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. అన్ని ప్రాంతాలకు అత్యధిక వేగంతో కూడిన రైళ్లను నడపడంతోపాటు ప్రయాణికుడికి తొలి స్టేషన్ నుంచి గమ్యస్థానం వరకు మరచిపోలేని ప్రయాణ అనుభూతిని మిగిల్చేలా సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఓఆర్‌ఆర్‌కు

..మిగతా 2 లో



## మహిళలదే పై చేయి

- రాష్ట్ర ఓటర్లు 3,35,27,925
- పెరిగిన ఓటర్లు 4,90,318
- కొత్త ఓటర్లు 5,45,046
- తొలగించిన ఓట్లు 1,17,932
- వివరాలు వెల్లడించిన ఎన్నికల సంఘం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓటర్ల వివరాలను రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి సీ సుదర్శన్‌రెడ్డి

..మిగతా 2 లో

## పాతబస్తీలో ఐటీ టవర్స్, కేబుల్ బ్రిడ్జ్..

### ఇది ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ

- నగరాభివృద్ధికి ఎవరితోనైనా కలుస్తాం
- ఆరాంఘర్ ఫ్లైఓవర్‌ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- ఫ్లైఓవర్‌కు మన్మోహన్ సింగ్ పేరు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:



హైదరాబాద్ అంటే అందరికీ ముందుగా గుర్తొచ్చేది ఓల్డ్ సిటీ అని.. ఇది ఓల్ట్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఓల్డ్ సిటీని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ఎవరితో కొట్లాడేందుకైనా.. ఎవరినైనా కలుపుకుని పోయేందుకైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద ఫ్లైఓవర్ అయిన ఆరాంఘర్ జూపార్క్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఓల్డ్ సిటీపై వరాల జల్లు కురిపించారు. ఆరాఘర్ జూపార్క్ ఫ్లైఓవర్‌కు దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టినట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రటించారు. అప్పట్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో హైదరాబాద్‌లో పీవీ ఎక్స్‌ప్రెస్ అతిపెద్ద ఫ్లైఓవర్ నిర్మించారని.. ఇప్పుడు అదే తరహాలో తెలంగాణ ఏర్పడ్డాక రెండో అతి పెద్ద ఫ్లైఓవర్ నిర్మించుకున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగర అభివృద్దే

..మిగతా 2 లో



## రెచ్చిపోయిన మావోయిస్టులు

- ఛత్తీస్‌గఢ్‌లో జవాన్ల వాహనం పేల్చివేత
- 9 మంది జవాన్లు మృతి

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలో జవాన్లు ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు ఐఈడీ బాంబుతో

..మిగతా 2 లో

## కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

### 9న విచారణకు రావాలని పిలుపు

- నిన్న ఏసీబీ ఆఫీసు వద్ద హైడ్రామా
- విచారణకు వచ్చి వెళ్లిపోయిన కేటీఆర్
- లాయర్‌ను అనుమతించకపోవడంతో తిరుగు పయనం
- నేడు క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు
- ఈడీ విచారణకు రావడానికి సమయమివ్వాలని రిక్వెస్ట్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఫార్ములా ఈరేస్ వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గచ్చిబౌలి ఓరియన్ విల్లాకు వెళ్లిన ఏసీబీ అధికారులు.. ఈ మేరకు కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ ఏసీబీ అధికారులు ఇప్పటికే ఒకసారి కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. విచారణ నిమిత్తం ఇవాళ ఉదయం కేటీఆర్.. ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. అక్కడ తన న్యాయవాదిని పోలీసులు అడ్డుకోవడంపై కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనతో పాటు న్యాయవాది వస్తే నష్టమేంటని

..మిగతా 2 లో

## నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్లు

- 26 నుంచి మూడు పథకాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మంత్రులు పొన్నం, సురేఖతో కలిసి ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున మంజూరు చేస్తూ రానున్న నాలుగేళ్లలో అర్హులందరికీ గృహాలను నిర్మించే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అత్యంత నిరుపేదలను పారదర్శకంగా గుర్తించి వారికి జనవరి 31లోగా మంజూరు ఇస్తామని పేర్కొన్నారు. శాసనసభ, ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా ప్రతిపక్షం తీరు మారడం లేదని భారాసపై మండిపడ్డారు. శాసనసభకు వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వమంటే సభకు రాకుండా అల్లరి

..మిగతా 2 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
07.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# మహిళలదే పై చేయి

మొదటిపేజీ తరవాయి భాగం: వెల్లడించారు. నిరుడు అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 28వ తేదీ వరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల నుంచి అందిన క్లెయిమ్స్ ఆధారంగా సోమవారం తుది జాబితాను ఆయన ప్రకటించారు. దాని ప్రకారం రాష్ట్రంలో మొత్తం 3,35,27,925 మంది ఓటర్లు ఉండటం గమనార్హం. గత సంవత్సరంతో పోలిస్తే ఓటర్ల సంఖ్య 4,90,318 పెరిగింది. కొత్తగా 5,45,046 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో పురుష ఓటర్ల కన్నా 2,26,246 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 2,19,610 మంది ఓటర్లు తమ నియోజకవర్గాలను మార్చుకున్నారు. వివిధ కారణాల వల్ల 1,17,932 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్టు ఎన్నికల ముఖ్య అధికారి తెలిపారు. కాగా, రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లిలో, అత్యత్ప ఓటర్లు భద్రాచలం నియోజకవర్గంలో ఉండటం గమనార్హం. రాష్ట్రంలో మొత్తం 2,829 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉండగా.. అత్యధికంగా వరంగల్ తూర్పు (341 మంది) నియోజకవర్గంలో ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఒక్క ట్రాన్స్‌జెండర్ ఓటరు నమోదు కాలేదు. భువనగిరి, దేవరకద్ర, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఒక్కరు చొప్పున ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉండగా.. మిగతా అన్ని నియోజకవర్గాల్లో ఒకరి కంటే ఎక్కువ మంది ఉండటం విశేషం.




# భారత్ కు బుల్లెట్ రైలు..!

మొదటిపేజీ తరవాయి భాగం

అనుసంధానం చేయడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగవంతమయ్యేందుకు పునాదులు పడతాయన్నారు. జమ్మూ రైల్వే డివిజన్ ప్రారంభం, తూర్పు కోస్తా రైల్వే రాయగడ డివిజన్ భవన నిర్మాణానికి పునాదులు వేయడం, చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో సోమవారం ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా, చర్లపల్లి టెర్మినల్ వేదికపై నుంచి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సోమన్న, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పంతో ముందుకెళ్తున్నామని... నాలుగు విభాగాల్లో రైల్వేను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మౌలిక వసతులు, ప్రయాణికుల సదుపాయాలు, మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ, ఉపాధి కల్పన కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భారత రైల్వేకు బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తున్నామని.. కోట్లాది మందిని వందే భారత్ రైళ్లు గమ్యం చేరుస్తున్నాయని అన్నారు. 180 కిలోమీటర్ల వేగంతో వందే భారత్ స్లీపర్ కోచ్ ట్రయిల్ రన్ నడిచిందని అన్నారు మోడీ. సోలార్ స్టేషన్ గా చర్లపల్లి టర్మినల్‌ను అభివృద్ధి చేశారని.. ఔటర్ రింగ్ రోడ్డుకు ఇది సమీపంలో ఉందని అన్నారు మోడీ. తెలంగాణ ప్రగతిలో చర్లపల్లి రైల్వే టర్మినల్ అత్యంత కీలకంగా మారబోతోందని.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా చర్లపల్లి లాంటి స్టేషన్లు అవసరమని అన్నారు.

# కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

మొదటిపేజీ తరవాయి భాగం

ప్రశ్నించారు. దీంతో రోడ్డుపైనే తన స్పందనను రాతపూర్వకంగా ఏసీబీ అధికారులకు అందజేశారు. హైకోర్టు తీర్పు తర్వాత చట్టప్రకారం ముందుకెళ్లాలని అందులో పేర్కొన్నారు. విచారణకు హాజరుకాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులిచ్చారు. ఈ సారి న్యాయవాది సమక్షంలో ప్రశ్నిస్తారా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు ఈరేస్ వ్యవహారంలో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై వాదనలు ముగియడంతో ఉన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. తీర్పు వెల్లడించే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్ పిటిషన్‌పై మంగళవారం ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

**ఈడీ విచారణకు టైమ్ ఇవ్వాలని రిక్వెస్ట్..**

ఫార్ములా ఈరేసు కేసులో కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చి.. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది. అయితే, ఏసీబీ కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం తీర్పు వెల్లడికానుంది. ఈ నేపథ్యంలో విచారణకు సమయం ఇవ్వాలని ఈడీని.. కేటీఆర్ కోరారు. హైకోర్టు తీర్పు వెలువరించేంత వరకు సమయం ఇవ్వాలని కోరారు.

# మంత్రి పీఏపై ఆరోపణలు అవాస్తవం

- అసలు ఆయనెవరో కూడా నాకు తెలీదు
- నేను భూమి అమ్మింది హరిప్రసాద్,అశోక్ అనే వ్యక్తులకు
- మంత్రి పీఏ ఎవరో నాకసలు తెలీదు
- స్థానికులు కొందరు కావాలనే వివాదం సృష్టిస్తున్నారు
- సమస్యను పరిష్కరించాలని స్థానిక సీఐకు ఫిర్యాదు చేశా
- భూ యజమాని సాయిని వెంకటేశ్వరరావు వివరణ



విశాలభారతి, తుంగతుర్తి:

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం సింగారం గ్రామ పంచాయతీలో మంత్రి పీఏ భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఇటీవల కొందరు సోషల్ మీడియా, యూట్యూబ్, వాట్సాప్ గ్రూపుల్లో దుష్ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఆదివారం నాడు ఆయన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఈ విషయానికి సంబంధించి భూ యజమాని సాయిని వెంకటేశ్వరరావు సోమవారం నాడు తుంగతుర్తి పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. మంత్రి పీఏపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని.. అసలు ఆయనెవరో తనకు తెలీదని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న సుమారు 16 ఎకరాల భూమికి సంబంధించిన అసలు పట్టాదారును తానేనని తెలిపారు. ఈ విషయంపై వివాదానికి సంబంధించి స్థానిక సీఐకి ఫిర్యాదు చేశానని.. ఆయన రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. తాను భూమి అమ్మింది హరిప్రసాద్, అశోక్ అనే వ్యక్తులకు అని.. వారు వరంగల్ జిల్లాకు చెందిన వారని తెలిపారు. కావాలనే కొందరు స్థానికులు ఈ విషయంపై వివాదాలు సృష్టిస్తున్నారని తెలిపారు.

**2008 నుంచి ఆ భూమి నాదే..**

తాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసినని.. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 2008లో తుంగతుర్తిలో కాలువలు తీశారని.. ఇక్కడ వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందన్న దృష్టితో తాను తన స్నేహితులు కలిసి ఇక్కడ దాదాపు 100 ఎకరాలకు పైగా భూమిని కొన్నట్లు తెలిపారు. ఆ తర్వాత కాలంలో అందరూ అమ్ముకున్నారని.. తన పేరుతో తన కుటుంబ సభ్యుల పేరుతో 16 ఎకరాల 4 గుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఆ భూమి 2008 నుంచి ఇప్పటి వరకు తన స్వాధీనంలోనే ఉందని తెలిపారు. కరోనా సమయంలో ఓ వ్యక్తి అకారణంగా తన భూమిని ఆక్రమించాడని.. అప్పటి జిల్లా ఎస్పీ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లానని.. వారు తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌కు కేసు రిఫర్ చేశారని తెలిపారు. దానిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని.. అనంతరం ఆక్రమణలు తొలగించారని తెలిపారు. ప్రస్తుతం కూడా ఆ కేసు తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో నడుస్తోందని తెలిపారు. అనంతర పరిణామాల్లో తనకు కొన్ని ఆర్థిక సమస్యలు రావడంతో ఈ భూమిని అమ్మదలిచానన్నారు. అశోక్, హరిప్రసాద్ అనే వ్యక్తులు వరంగల్ నుంచి వచ్చారని.. వారికి తన 16 ఎకరాల నాలుగు గుంటల భూమిని అమ్మానని తెలిపారు. వారు కొంత డబ్బును కూడా తనకు చెల్లించారని తెలిపారు. వారు మొత్తం భూమిని పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేవని తెలిశాకే తన వద్ద భూమి కొన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడున్న స్థానికులు కమిషన్ కావాలని తనను అడిగారని తెలిపారు. ముందు తాను ఇవ్వనన్నానని.. అయితే అక్కడున్న పెద్ద మనిషి మాధవరావు తనతో మాట్లాడారని.. ఎంతో కొంత ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం అర్వపల్లిలోని కల్యాణ మండపంలో కూర్చుని ఆ పెద్ద మనుషులను పిలిచి కమిషన్ గా వారికి రూ.5 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించానని తెలిపారు. రూ.2.5 లక్షలు వారికి చేరాయని.. మిగతా డబ్బులు కూడా రిజిస్ట్రేషన్ రోజు ఇస్తానని చెప్పినట్లు తెలిపారు. అయితే ఈ మధ్య కాలంలోనే కొంత మంది కావాలని ఆ గ్రామానికి చెందిన వారు తన భూమి మధ్యలో రాత్రికి రాత్రి పెద్ద రోడ్డు నిర్మాణం చేశారని తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో సామరస్యంగా దాన్ని పరిష్కరించేందుకు ఆ గ్రామ పెద్దలతో కూర్చుని మాట్లాడానన్నారు. కొంత డబ్బు ఇచ్చేందుకు వారితో ఒప్పందం చేసుకున్నానన్నారు. ఇది మొత్తం ముగిసిందని.. తాను అమ్మిన తర్వాత.. కొనుగోలు చేసిన వారు దానిని శుభ్రం చేసుకునే క్రమంలో అక్కడ కావాలని కొంతమంది వ్యక్తులు గలాటా సృష్టించారని తెలిపారు. ఆ విషయం కూడా తన దృష్టికి వచ్చిందని.. దాని గురించి మాట్లాడేందుకే ఈ రోజు తాను ఇక్కడికి వచ్చానన్నారు. గలాటా చేసేవాళ్లకు స్థానికులకు అసలు ఈ భూమితో సంబంధమే లేదని తెలిపారు. ఆ భూమి తనదని.. తన పేరు మీద ఉందని.. ఆ భూమిని అమ్ముకునే హక్కు తనకుందని.. తెలిపారు. కొందరు వ్యక్తులు కావాలనే అక్కడ సమస్యలు సృష్టిస్తున్నారని తెలిపారు. తాను వాస్తవంగా భూమి అమ్మింది అశోక్, హరిప్రసాద్ అనే వ్యక్తులకని తెలిపారు. ఇక్కడ స్టేషన్‌కు వచ్చిన తర్వాత తన దృష్టికి కొన్ని విషయాలొచ్చాయని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి పీఏకి సంబంధం ఉందని.. యూట్యూబ్‌లలో, సోషల్ మీడియాలో వచ్చిందని తనకు తెలిసిందన్నారు. వాస్తవంగా అసలు ఆయనెవరో తనకు తెలియదు.. నేనెవరో ఆయనకు తెలియదన్నారు. మధ్యలో ఆయన పేరు తీసుకురావడం బాధాకరమైన విషయమన్నారు. స్థానికులు కొంతమంది కావాలనే దీన్ని పెద్ద సమస్యగా చేసి బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలన్నీ స్థానిక సీఐ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని ఆయనకు విన్నవించినట్లు తెలిపారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి.. రెవెన్యూ వారి దృష్టికి విషయం తీసుకెళ్లి.. అక్కడసలు దారి ఉందా లేదా తెలుసుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనవసర వివాదాల జోలికి వెళ్లొద్దని కూడా గ్రామస్థులకు సీఐ తెలియజేశారని రైతు వెంకటేశ్వరరావు వివరించారు.



# నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్లు

మొదటిపేజీ తరవాయి భాగం

చేసేవారిని పంపారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వారికి గుండు సున్నానే వస్తుందని వ్యాఖ్యానించారు. ఈనెల 26 నుంచి రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ మూడు పథకాలను అమలు చేయనున్నామని వెల్లడించారు. ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు కేటాయించిన 112 విద్యుత్తు బస్సుల్లో 50 వాహనాలను సోమవారం హనుమకొండలో ప్రారంభించారు. దీంతో పాటు పలు అభివృద్ధి పనులు, సమీక్ష కార్యక్రమాలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు.

**ఓరుగల్లు అభివృద్ధికి ప్రణాళికలు**

'హైదరాబాద్‌తో సమానంగా ఓరుగల్లును అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందుకు అనుగుణంగా పలు అభివృద్ధి పనులకు రూ.6 వేల కోట్లు మంజూరు చేశారు. రాజకీయాలకతీతంగా అందరికీ ఇళ్లను మంజూరు చేస్తాం. ఆర్టీసీని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోంది. సంక్రాంతిలోపు రెండో విడతలో మరిన్ని ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించబోతున్నాం. గత ప్రభుత్వం అపరిష్కృతంగా వదిలేసిన 1.5 లక్షల ఇళ్లను పూర్తిచేసి అర్హులకు అందిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు 80 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటికే 65 లక్షల మంది వివరాలను యాప్‌లో నమోదు చేశాం. 40 శాతం డైట్, 200 శాతం కాస్మెటిక్ ఛార్జీలు పెంచాం. దండగ అన్న ఆర్టీసీని పండగ చేసి కార్మికులకు భద్రత కల్పించాం' అని అన్నారు.

మంత్రి పొన్నం మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆర్టీసీలో 125 కోట్ల మంది ప్రయాణికులు రూ.4350 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులకు 2013కు సంబంధించిన బాండ్లు, 21 శాతం పీఆర్‌సీ ఇచ్చామని గుర్తు చేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుంటే గిట్టనివారు ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాదిలోనే 60 వేల మందికి ఉద్యోగాలిచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే.. కళ్లుండి చూడలేని వారు సామాజిక మాధ్యమాల ద్వారా ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్‌నాగరాజు, గండ్ర సత్యనారాయణ, దొంతి మాధవరెడ్డి, యశస్వినిరెడ్డి పాల్గొన్నారు.



# పాతబస్తీలో ఐటీ టవర్స్, కేబుల్ బ్రిడ్జ్..

మొదటిపేజీ తరవాయి భాగం

కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మరోసారి స్పష్టం చేశారు. మెట్రో రైలు, రోడ్ల విస్తరణ, శాంతి భద్రతల పరిరక్షణ, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన లాంటి అంశాలను ప్రాధాన్యతగా పెట్టుకున్నామని వివరించారు. ఫ్లై ఓవర్ ప్రారంభంతో పాటు సివరేజ్ పనులు కూడా ప్రారంభించినట్టు తెలిపారు.

మూసీ నదిని పునరుజీవింపజేయాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌కు గోదావరి జలాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నిజాం కాలంలో కాలంలో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లను నిర్మించి.. నగరానికి తాగునీటి సమస్యలు లేకుండా చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ లేక్ సిటీగా ఉండేదని.. నిజాం చేసిన అభివృద్ధిని కాపాడుకుంటే ప్రపంచంలో హైదరాబాద్ బెస్ట్ సిటీగా ఉండేదని తెలిపారు. చిన్నపాటి వర్షం వచ్చినా నగరంలో వరదలు, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు.

అక్బరుద్దీన్ ఒవైసీ తనకు చిన్నప్పటి మిత్రుడేనని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే.. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు కలిసి పని చేస్తాయని తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ప్రధాని మోదీతో కొట్లాడాల్సి వస్తే కొట్లాడతానని.. అసదుద్దీన్‌తో కలవాల్సి వస్తే కలుస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే.. మోదీతో కొట్లాడి ఓల్డ్ సిటీకి మెట్రో తీసుకొచ్చామని తెలిపారు.మరోవైపు.. మీర్ ఆలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఓల్డ్ సిటీ అభివృద్ధి కోసం అక్బరుద్దీన్ ఒవైసీ అడిగిన పనులన్నింటికీ డబ్బులు మంజూరు చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఓల్డ్ సిటీలోని గల్లీ గల్లీ తనకు తెలుసని.. చిన్నప్పటి నుంచి ఇక్కడి నుంచే తన సొంతూరికి వెళ్లేవాడినని వివరించారు. మరోవైపు.. ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.ఇదిలా ఉంటే.. ఓల్డ్ సిటీలో ఐటీ టవర్స్ నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. హైదరాబాద్ అనగానే అందరికి ముందుగా ఓల్డ్ సిటీనే గుర్తుకొస్తుందని.. ఆ తరువాతే ఇతర ప్రాంతాలు గుర్తుకొస్తాయని తెలిపారు. తాము నిర్మించిన ఫ్లైఓవర్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నాడంటూ కొందరు బీఆర్ఎస్ నేతలు అంటున్నారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే సరైన సమయానికి నిధులు విడుదల చేసి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేశామని శ్రీధర్ బాబు కౌంటర్ వేశారు. ఓల్డ్ సిటీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీధర్ బాబు తెలిపారు.



# రెచ్చిపోయిన మావోయిస్టులు

మొదటిపేజీ తరవాయి భాగం

పేల్చేశారు. ఈ ఘటనలో 8 మంది డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్‌డీఆర్‌జీ సిబ్బందితోపాటు ఓ డ్రైవర్ మృతి చెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. మరో ఆరుగురికి గాయాలైనట్లు తెలుస్తోంది. దాడి జరిగిన సమయంలో వాహనంలో 15 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. దాడికి గురైన బస్సులోని సిబ్బంది దంతెవాడ, నారాయణ్‌పుర్, బీజాపుర్‌లో యాంటీ నక్సలైట్ అపరేషన్ పూర్తి చేసుకుని బేస్ క్యాంప్‌నకు తిరుగుప్రయాణమయ్యారు. భద్రతా బలగాల కాన్వాయ్ బీజాపుర్‌లోని కుట్‌రూ హరదారిపై వెళుతున్న క్రమంలో అంబేలీ గ్రామం వద్ద మావోయిస్టులు ఐఈడీ పేల్చేశారు. భారీ పేలుడు ధాటికి కాన్వాయ్‌లోని ఓ వాహనం చెల్లాచెదురుగా పడిపోయింది. దీంతో ప్రాణ నష్టం ఎక్కువగా జరిగింది. పేలుడు జరిగిన ప్రాంతంలో పెద్ద గుంత ఏర్పడింది. దీనిపై సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యల కోసం ఘటనాస్థలికి రీఇన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్‌ను పంపించినట్లు ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఇదిలా ఉండగా, గత రెండేళ్లలో భద్రతా సిబ్బందిపై నక్సలైట్లు జరిగిన అతి పెద్ద దాడి ఇదేనని ఓ అధికారి వెల్లడించారు.

**ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారమా..?**

శనివారం అర్ధరాత్రి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందగా ఓ డీఆర్‌జీ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే గత రెండు రోజులుగా భద్రతా దళాలు మావోయిస్టుల కోసం గాలిస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు జవాన్ల కాన్వాయ్‌పై దాడి చేశారు. 2023 ఏప్రిల్ 26న దంతెవాడ జిల్లాలో భద్రతా సిబ్బందిని తీసుకువెళుతున్న కాన్వాయ్‌పై నక్సలైట్లు ఇలాగే దాడి చేశారు. ఆ ఘటనలో 10మంది పోలీసులు సిబ్బంది సహా ఓ డ్రైవర్ మృతిచెందాడు.



## నునావత్ నరసింహని పరామర్శించి, ఆర్థిక సహాయం

■ టిపిసిసి మెంబర్ డా.లకావత్ లక్ష్మీనారాయణ నాయక్

**దేవరుప్పుల, విశాల భారతి**

దేవరుప్పుల మండలం పొట్టిగుట్ట తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నునావత్ నరసింహ పెద్దమ్మ నునావత్ ద్వాలి ఆదివారం సాయంత్రం 5 గంటలకు మరణించారు. టిపిసిసి మెంబర్ డా.లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ ఆమె భౌతికకాయనికి పూలమాల వేసి, ఆర్థిక సాహయం అందించారు. వారితో పాటు, దేవరుప్పుల మండల మాజీ అధ్యక్షులు ఉప్పల సురేష్ బాబు, ధర్మగడ్డ తండ గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్యా యదన్న, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, మండల నాయకులు బానోత్ భాస్కర్, నల్ల యాదగిరి, ఎస్టిసెల్ మండల యూత్ అధ్యక్షులు గుగులోత్ నరేందర్, గ్రామ యూత్ అధ్యక్షులు మూఢ సోమన్న, పంగ రాములు, మూడజగరం, మాజీ సర్పంచ్ గుగులోతు ఆంజనేయులు బానోత్ భాగ్య, వంకుడోత్ యాకు, తదితరులు పాల్గొన్నారు.




### అధిక ధరలను నియంత్రించడంలో

## కేంద్ర ప్రభుత్వం విఫలం

■ ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**సూర్యాపేట, విశాలభారతి**

రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆరోపించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహా రెడ్డి భవన్ లో జరిగిన ఐద్వా సూర్యాపేట జిల్లా వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ధరలబారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని మూలంగా మహిళలు సరైన పోషక ఆహారా పదార్థాలు తీసుకోకపోవడంతో రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 16 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని కోరారు. పౌష్టిక ఆహారం లేకపోవడం మూలంగా పిల్లలలో ఎదుగుదల లోపం ఉందన్నారు. దేశంలో చిన్నారుల ఎదుగుదల రేటు 35.5 శాతంగా ఉందన్నారు. ఐదు సంవత్సరాల వయసు ఉన్న పిల్లల్లో2.9 శాతం మంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో సంపద కొద్దిమంది చేతుల్లో కీ పోతుందని అన్నారు. మూడు పూటలు భోజనం తినని కుటుంబాలు దేశంలో లక్షలాదిగా ఉన్నాయన్నారు. అనేకమంది వ్యాపారస్తులు కృత్రిమ కొరత సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్ కు సరుకులను తరలిస్తున్నారని, వాటిని వెలికి తీసి పేదలందరికీ పంచాలని కోరారు. పాలకులు విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా మహిళల పై, విద్యార్థులపై, యువతి లపై జరుగుతున్న హత్యలు అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు గోరంగా వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. అనేక చట్టాలు వచ్చినప్పటికీ మహిళలపై జరుగుతున్న దాడులు హింస తగ్గడం లేదని చట్టాలను సమర్థవంతంగా అమలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఐద్వా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో కుమ్మరి బజార్ లో మహిళలు ఎదుర్కొంటున్న అధిక ధరల భారంపై సర్వే నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకట చంద్ర అధ్యక్షతన జరిగిన ఈ వర్క్ షాప్ లో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి , జిల్లా నాయకురాలు మేకన బోయిన సైదమ్మ, జూలకంటి విజయలక్ష్మి, అందం నారాయణమ్మ, ఇంద్రియాల త్రివేణి, సుందరి రమాదేవి, నెమ్మాది లక్ష్మి, తుమ్మజడ వెంకట కోటమ్మ, ములకలపల్లి ఝాన్సీ, ఆది మల్ల సునీత, పిండిగా నాగమణి, లక్ష్మి ,ఎల్లమ్మ, ప్రమీల, సరిత, ఆవుదొడ్డి భాగ్యమ్మ, ప్రవళిక, కొప్పుల రజిత తదితరులు పాల్గొన్నారు.



## భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రథకం

■ బాల్కొండ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్

**బాల్కొండ, విశాల భారతి**

భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మీడియాతో బాల్కొండ ఇంచార్జ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, చరిత్రలో ఎవరు ఆలోచన చేయని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి లేని నిరుపేదలకు ఏట 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని అన్నారు. దిని పట్ల ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. రైతులకు రైతు భరోసా అమలు చేసినట్లే, పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల బాల్కొండ నియోజకవర్గ ప్రజానీకం తరపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,బ్లాక్ అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ కు జన్మదిన శుభాకాంక్షలు

**సూర్యాపేట, విశాల భారతి**

సూర్యాపేట మున్సిపల్ కమీషనర్ బి. శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మున్సిపల్ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్లు యమ్.డీ. గౌసుద్దీన్, ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్, ఇండ్ల మనోజ్ కుమార్, మెప్మా టిఎంసి శ్వేత తో పాటు పలువురు ఉన్నారు.



# సిఎం రేవంత్ ను రైతులు క్షమించరు

■ పల్లా సుందర్ రాంరెడ్డి

**దేవరుప్పల, విశాల భారతి**



తెలంగాణ రైతాంగానికి సిఎం రేవంత్ రెడ్డి తీరని ద్రోహం చేశారని, రైతుభరోసా సాయాన్ని ఎకరానికి ఏటా రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి చివరకు రూ.12 వేలకు కుదించడం రైతులను నిలువునా వంచించడమేనని, తెలంగాణ రైతాంగం ఈ ద్రోహాన్ని క్షమించదని, కాంగ్రెస్ చేసిన మోసాన్ని గ్రామగ్రామాన ఎండగట్టేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. అందులో భాగంగానే సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలమేరకు, జనగామ జిల్లా బిఆర్ఎస్ నాయకుడు పల్లా. సుందర్ రాంరెడ్డి, దేవరుప్పల మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, ఆద్వర్యంలో దేవరుప్పుల మండల కేంద్రంలోని జనగామసూర్యాపేట రహదారి చౌరస్తాలో రోడ్డు పై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా సుందర్ రాంరెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలుచేయని ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని, ఎన్నికలముందు 15 వేలు ఇస్తానని మాటిచ్చి గెలిచాక ఇవాళ 12 వేలె ఇస్తామని బూటకపు మాటలు చెబుతున్నారని,రైతు బంధు రాలే, రుణమాఫీ కాలే,మళ్ళీ ఇప్పుడు వచ్చే ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి మళ్ళీ రైతులను మోసం చేస్తారని,ఈ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మొద్దని తెలిపారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## ఆరోగ్యం బాగున్నప్పుడు రోబోటిక్ సర్జరీ చేయించుకోవాలి

■ డాక్టర్ సునీల్ దాచేపల్లి

**సూర్యాపేట, విశాల భారతి**

మోకాళ్ళ అరుగుదల ఒక వయసు వచ్చాక ప్రతి ఒక్కరిలో ఉంటుందని దాన్ని అలా వదిలేస్తే భవిష్యత్తులో బాత్రూంకు కూడా నడవడం కష్టతరం అవుతుందని యశోద ఆసుపత్రి సోమాజీగూడ సీనియర్ అర్థోపెడిక్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ కీ హోల్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జాజు బాంకెట్ హాల్లో ఏర్పాటు చేసిన మోకాళ్ళ శాస్త్ర చికిత్సలో భాగంగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ అత్యాధునిక పద్ధతిపై అవగాహన కల్పించి మాట్లాడారు. మోకాళ్ళ నొప్పులను నివారించేందుకు మొత్తం నాలుగు స్టేజీలు ఉంటుండగా మొదటి రెండు స్టేజీల వరకు ఇంజక్షన్ తీసుకోవచ్చని కానీ ఆఖరి రెండు స్టేజీల్లో శస్త్ర చికిత్స మాత్రమే పని చేస్తుందన్నారు. చాలామంది శస్త్ర చికిత్సకు భయపడి ఇంజక్షన్ మాత్రమే చేసుకొని మోసపోతున్నారని, ప్రతి ఒక్కరు తమ మోకాళ్ళ అరుగుదలను కనుగొని శస్త్ర చికిత్స చేయించుకోవడం మంచిదన్నారు. చేతులతో సర్జరీలు చేస్తే కొన్ని సార్లు దానిలో అంగిల్స్ తేడా రావచ్చని కానీ రోబోతో చేస్తే ఖచ్చితంగా సరైన కటింగ్ విధానం బాగుంటుందని ప్రిపరేషన్ సరిగా ఉంటుందన్నారు. రోబోటిక్ సర్జరీతో జీవిత కాలంలో మరో శస్త్ర చికిత్స చేయకుండా ఉపయోగపడుతుందన్నారు. నొప్పి తక్కువ, కటింగ్ చిన్నవిగా ఉండడం తో త్వరగా కోలుకుంటారని అన్నారు. రోబోటిక్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జరీతో చాలా ప్రయోజనాలున్నాయని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం రోబోటిక సర్జరీ చేయించుకున్న సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మంత్రమూర్తి శంకరమూర్తి, సంజీవరెడ్డిలు తమ అనుభావాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ యు.పరమేష్, అసిస్టెంట్ మేనేజర్ టి.రామ్ ప్రకాష్ లు ఉన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

■ ఎస్ఐ సృజన్ కుమార్

**దేవరుప్పల, విశాల భారతి**

దేవరుప్పుల మండలం, గొల్లపల్లి వాగులో నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ దాన్ని సీజ్ చేసి మంజు సాయికుమార్ పైన కేసు నమోదు చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇకముందు ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సృజన్ కుమార్ హెచ్చరించారు.



## ఒకే కాన్పులో నలుగురు పిల్లలు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

కర్ణాటకలోని మంగళూరులో తెలంగాణ కు చెందిన ఓ మహిళ నలుగురు పిల్లలకు జన్మనిచ్చారు. అందులో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. వైద్యుల వివరాల ప్రకారం, తెలంగాణ రాష్ట్రానికి చెందిన బానోత్ దుర్గ మంగళూరులో నివసిస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఆమె గర్భం ధరించగా, సోమవారం కంకనాడి ఫాదర్ ముల్లర్ ఆస్పత్రిలో ప్రసవించారు. సిజేరియన్ ద్వారా నలుగురు చిన్నారులకు జన్మనిచ్చారు. పిల్లలంతా ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. 1 కిలో, 1.2 కిలోలు, 800 గ్రాములు, 900 గ్రాముల బరువుతో చిన్నారులు జన్మించారని చెప్పారు. అయితే నెలల నిండకుండానే పుట్టడం వల్ల పిల్లలకు NICUలో చికిత్స అందించామని వైద్యులు తెలిపారు. 7 లక్షల మంది గర్భిణీల్లో ఒకరు మాత్రమే నలుగురి పిల్లలకు జన్మనిస్తారని గైనకాలజిస్ట్ డాక్టర్ జోలీన్ డిఅల్మేడా చెప్పారు. దుర్గకు ప్రినేటల్ కేర్ అందించామని, ప్రసవ సమయంలో వైద్యబృందం ఎంతో శ్రమించిందని వెల్లడించారు. దక్షిణ కన్నడ జిల్లా చరిత్రలో ఇది అరుదైన ప్రసవంగా అభివర్ణించారు.



## ప్రజావాణికి 87 దరఖాస్తులు

■ వనమహోత్సవ లక్ష్యాలను సాధించాలి.

■ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి.

■ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

**సూర్యాపేట, విశాలభారతి**

ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 87 వినతులు స్వీకరించడం జరిగిందని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం చాలా ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.మన మహోత్సవం 2025 కార్యక్రమానికి గాను జిల్లా వనమోత్సవ సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాగల వర్షాకాలంలో శాఖల వారీగా ప్రభుత్వం నిర్దేశిత ప్రణాళికలు ఇచ్చిందని 202526 సం॥ గాను 59 లక్షలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని దీనిలో ముఖ్యంగా డిఆర్డిఏ 29 లక్షలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ 15 లక్షల50 వేలు ,వ్యవసాయ శాఖకు నాలుగు లక్షలు ,ఇరిగేషన్ శాఖకు 2,50,000 మొత్తం 22 శాఖలకు గాను 59 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని శాఖల వారీగా వారి లక్ష్యాలను సాధించడానికి చర్యలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇచ్చిన లక్షణాల ప్రకారం మొక్కలు నాటుట కొరకు శాఖల వారీగా ప్రాంతాలను స్థలాలను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. గతంలో నాటిన మొక్కలు సంరక్షించుకోవాలని కలెక్టర్ తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది తప్ప హెల్మెట్ ,సీటు బెల్టును పెట్టుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరు పాటించాలని కలెక్టర్ కోరారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రత పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈనెల 9వ తారీఖున నిర్వహించే మోటార్ సైకిల్ ర్యాలీని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. సోమవారం నుండి కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు తమ వాహనంలో ప్రయాణించినప్పుడు తప్పక సీటు బెల్టు వినియోగించాలని అలాగే వాహనంలో వెనుక కూర్చున్న వారు కూడా సీటు బెల్టు ధరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు ,డిఎఫ్ సతీష్ కుమార్, డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డి డబ్ల్యు ఓ నరసింహారావు, జిల్లా యస్ సి అభివృద్ధి అధికారి బిఎస్ లత. సిపిఓ ఎల్ కిషన్, డిఎం అండ్ హెచ్ ఓ కోటాచలం, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి ,డిటిడిఓ శంకర్, డిఇఓ అశోక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, పశుసంవర్ధక అధికారి డి శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర శర్మ ,జిల్లా పౌరసరఫరాల అధికారి డి రాజేశ్వర్ ,డిపిఓ నారాయణరెడ్డి, పి ఆర్ ఈ ఈ కే మాధవి, డి డి ఐ ఈ ఓ భాను నాయక్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## భీమ్‌గల్ అంగడిలో రెండు దొంగతనాలు

**బాల్కొండ, విశాల భారతి**

భీమ్‌గల్ అంగడిలో జరిగిన రెండు దొంగతనాలపై కేసు నమోదు చేసినట్లు భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు.. కుప్కల్ గ్రామానికి చెందిన బాబానగర్ నర్సు, పల్లికొండ గ్రామానికి చెందిన గంధం సుప్రియ వేరు వేరుగా సోమవారం భీమ్‌గల్ అంగడికి వెళ్లారు. కుప్కల్ గ్రామానికి చెందిన బాబానగర్ నర్సు కూరగాయలు కొంటూడగా కవర్లో పెట్టుకున్న రూ.20వేలు ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగలించారని ఫిర్యాదు చేశారు. పల్లికొండ గ్రామానికి చెందిన గంధం సుప్రియ విజయదుర్గ సిల్వర్ మర్చంట్ పేరు గల బ్యాగ్ లో అర్ధతులం విలువ చేసే బంగారు కమ్మలు పెట్టుకొని అంగట్లో కూరగాయలు కొంటూడగా, ఆ సమయంలో బంగారం పెట్టిన బ్యాగును పక్కకు పెట్టగా ఎవరో గుర్తు తెలియని దొంగలు ఆ బ్యాగును దొంగలించినారని,ఆ బ్యాగులో ఉన్న అర్ధతులం బంగారం, కొంత నగదు దొంగలించారని ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదులను తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
07.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## సిసి రోడ్డు పనులను పరిశీలన



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

పెద్ద అంబర్పేట మున్సిపాలిటీలోని ఐదవ వార్డులో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సిసి రోడ్డు పనులను కౌన్సిలర్ బుర్ర అనురాధ సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీలో ఉన్న ఐదో వార్డులో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికీ కనీస అవసరాలు తీర్చడమే ముఖ్యంగా డ్రైనేజీ మరియు సిసి రోడ్ వేయడం జరుగుతుందని అన్నారు.



## గ్రీన్ ఫీల్డ్ రోడ్డును ప్రభుత్వ భూమి నుండి వేయాలి

**ఆమనగల్లు, విశాల భారతి :**

ప్రభుత్వం నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో తాము పంట పొలాలు కోల్పోతున్నామని దాన్ని ప్రభుత్వ భూమి నుండి వేయాలని ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండా రైతులు జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, తహసీల్దార్ లకు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకున్న ఎకరా, అర ఎకరా పచ్చని పంట పొలాల నుండి రోడ్డు సర్వే చేస్తున్నారని, దానిని వెంటనే నిలుపుదల చేసి రోడ్డు పక్కనుండి ఉన్న ప్రభుత్వ భూమిలో నుండి వేయాలని వారు అధికారులకు ఇచ్చిన వినతి పత్రాలలో కోరారు. కార్యక్రమంలో రైతులు మణిపాల్, బోడ్యి, చందర్, పాందు, రవిరాథోడ్, విజేందర్, రాజా, వినోద్, గోపి,శివరాం, కుమార్ తథిరులు నాయకులు పాల్గొనడం జరిగింది.



## ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుండి మంచి స్పందన

- మక్తమాదారంలో విజయవంతమైన వైద్య ఆరోగ్య శిబిరం

**ఆమనగల్లు, విశాల భారతి :**

కడ్తాల్ మండలంలోని మక్తమాదారం గ్రామపంచాయతీలో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని డిసిసిబి డైరెక్టర్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్, గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ జడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి లతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు ఉప్పల అఖిల్ బృందం పరీక్షలు చేసి అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ఉచితంగా నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపరచుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 420 మందికి పైగా రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గణేష్, మాదారం బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు కృష్ణయ్య, జలీల్, మహేందర్ గౌడ్, కిషన్, జంగయ్య, చెన్నయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.








## కొల్లూరులో వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

- పాల్గొన్న మైనంపల్లి హన్మంత్ రావు
- అయ్యప్ప స్వామికి 'కాట' దంపతుల పూజలు

**పటాన్ చెరు,విశాలభారతి**

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో కౌన్సిలర్ మయూరి రాజు గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వామి మహపడి అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వాములు వందలాదిగా తరలివచ్చి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి భజనలు, సంకీర్తనలు, నామస్మరణతో కొల్లూర్ గ్రామం మారుమ్రోగింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్, ఆయన సతీమణి సంగారెడ్డి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమీన్ పూర్ 15వ వార్డ్ కౌన్సిలర్ కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## దేవాలయాలతో మానసిక ప్రశాంతత

- బీఆర్ఎస్ పార్టీ నేత దండం రాం రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

దేవాలయాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీఆర్ఎస్ పార్టీ నేత దండం రాం రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరు లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నక్క బాల్ రాజ్ గౌడ్, నక్క శ్రీనివాస్ గౌడ్, నక్క వీరేశం, నక్క వెంకటేష్, పడమటి మహిపాల్ రెడ్డి, కవాడి మహేందర్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్, బాల్ రాజ్, మహదేవ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



## మాల జంగం మహేశ్వర సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించిన బండి రమేష్

**కూకట్ పల్లి విశాల భారతి:**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మాల జంగం మహేశ్వర సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సోమవారం బాలనగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సంఘం అధ్యక్షులు బొబ్బిలి రమేష్, జనరల్ సెక్రెటరీ గౌరీ అమర్నాథ్, జాయింట్ సెక్రెటరీ గౌడి కోటేష్ గౌడి, నిమ్మ సదానందం, బసవరాజ్, ప్రభు ప్రభు లింగం, చక్రపాణి ,యోగేశ్వర్, నయీమ్, మోసిన్ ,జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు తెలియజేయండి

- కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్

**కాప్రా,విశాలభారతి:**

మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో డ్రైనేజీ, మంచినీటి సరఫరా మరియు ఇతరత్రా సమస్యలపై కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైప్ లైన్లు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేసున్నామని అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీకి అవసరమైన అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కాలనీవాసులు సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కార దిశగా ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యకులు వాసుచారి, ఎర్ర అంజి మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



## ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం

**తుర్కయంజాల్, విశాలభారతి:**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూరులో వెలసిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబసహిత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. సోమవారం హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు, తుర్కయంజాల్ సహకార బ్యాంకు డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నక్క శివలింగం గౌడ్, తాళ్ల నిరంజన్ గౌడ్, వంగేటి జనార్దన్ రెడ్డి, గౌడ సంఘం చైర్మన్ రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ కొత్త శ్రీరాములు గౌడ్, బాలగోని జగన్ గౌడ్, నక్క శ్రీధర్ గౌడ్, బాలగోని శ్రీనివాస్ గౌడ్, నక్క సుమన్ గౌడ్ , నక్క కొండల గౌడ్, నక్క నర్సింగ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- విద్యార్థి దశ చాలా కీలకం
- ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

**సూర్యాపేట, విశాలభారతి**

రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్సై సాయిరాం సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం సూర్యాపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై సాయిరాం మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలను సరిగా పాటించకపోవడం వల్లే తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమని, ఆదశలోనే విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలకు ఎదగాలని,ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే అందరూ గౌరవిస్తారని, ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వాహన చోదుకులు డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ఫోన్లలో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు. చలికాలంలో మంచు అధికం కారణంగా ఓవర్టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవి. విద్య సాగర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చంప్లా , పి ఈ టి రేహమతుల్ల, హెల్త్ సూపర్వైజర్ జానీ పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

- భీమ్‌గల్ ఎస్సై జి.మహేష్

**బాల్కొండ, విశాల భారతి**

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తప్పకుండా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపారు. సోమవారం భీమ్‌గల్ పట్టణంలోని బడా భీంగల్ చౌరస్తా వద్ద ఆయన నేషనల్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. అతివేగం ప్రమాదాలకు కారణమని అన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం నేరమన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. త్రిబుల్ రైడింగ్ చట్ట రీత్యా నేరం అన్నారు. అవగాహనతో వాహనాలు నడపుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రతి ఒక్కరు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై అబ్దుల్ సత్తార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎసిబీకి చిక్కిన తొర్రూరు సర్కిల్ ఇన్స్పెక్టర్




**తొర్రూరు,విశాలభారతి:**

తొర్రూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ కర్రి జగదీష్ అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులకు చిక్కారు. అక్రమంగా రేషన్ బియ్యం లారీలను పట్టుకొని, వాటిని విడిచిపెట్టేందుకు నాలుగు లక్షల రూపాయలు డిమాండ్ చేసినట్లు సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సీఐ జగదీష్ ఇప్పటికే రెండు లక్షలు అందుకున్నారని, మిగిలిన రెండు లక్షలకు డిమాండ్ చేస్తుండగా, రేషన్ బియ్యం బాధితుడు అక్టోబర్ 25న ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో సోమవారం తొర్రూర్ పోలీస్ స్టేషన్‌లో దాడులు నిర్వహించారు. విచారణలో సీఐ జగదీష్ అవినీతిని నిర్ధారించిన ఏసీబీ అధికారులు,అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారుల ప్రకారం, సీఐ జగదీష్ అక్రమ లారీల దారులు నుంచి నాలుగు లక్షల రూపాయలు డిమాండ్ చేయడం, అందులో రెండు లక్షలు ఇప్పటికే స్వీకరించడంతో పాటు మిగిలిన డబ్బుకు డిమాండ్ చేయడం అడ్డంగా దొరికిపోయారు.ఈ ఘటనతో స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. అవినీతిపై చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## బండి రమేష్ కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు



**కూకట్ పల్లి,విశాలభారతి:**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ని బాలనగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్కనాగరాజు కూకట్పల్లి సీనియర్ కాంగ్రెస్ పార్టి మాజీ అధ్యక్షులు కర్కపెంటయ్యా లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మయ్య, హెచ్. ఏ. ల్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కూతాడి కృష్ణా,జాయింట్ సెక్రటరీ వెంకటపతి, నాగార్జున, ఆర్గనైసింగ్ సెక్రటరి పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలి

- **ఉమెన్ అండ్ చైల్డ్ సెక్యూరిటీ వింగ్ డిసిపి కే.సృజన**

**శేరిలింగంపల్లి-విశాల భారతి**

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉమెన్ అండ్ చైల్డ్ సెక్యూరిటీ వింగ్ డిసిపి కే.సృజన అన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ XI ను ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలని సైబరాబాద్ పరిధిలో వివిధ డిపార్ట్మెంట్ లకు చెందిన అధికారులను కోరారు. సోమవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బాల కార్మికుల విముక్తి ఎస్పి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి కే సృజన మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ XI లో పాలుపంచుకుంటున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళిక రూపొందించుకొని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా విధులు నిర్వహించాలన్నారు.ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని దానిని అనుభవించటం ప్రతీ పౌరుని హక్కు అన్నారు. క్షణికావేశంలో కొందరు పిల్లలు తొందరపాటులో చిన్న చిన్న విషయాలకే తల్లిదండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారని,ఇట్టి అవకాశాన్ని ఆసరాగా తీసుకొని కొందరు వారిని ప్రమాదకర పనుల్లో వారితో పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తప్పిపోయిన పిల్లలను వెతికి 'దర్పణ్ ' అప్లికేషన్ ద్వారా వారిని గుర్తించి,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరచి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చి వారి శోకాన్ని తీర్చాలన్నారు. భిక్షాటన చేస్తున్న వారి గురించి, బాలకార్మికుల గురించి ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్ లైన్ కు చెందిన 1098,112 నెంబర్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఒక మహిళా పోలీసు కానిస్టేబుల్‌తో సహా ఇన్‌స్పెక్టర్, 4 పోలీసు కానిస్టేబుళ్లు.అక్రమ రవాణాలో చిక్కుకున్న పిల్లలను గుర్తించి రక్షించి,పునరావాసం కల్పించేందుకు మొత్తం (11) బృందాలను ఏర్పాటు చేశామన్నారు.ఒక సబ్ఇన్స్పెక్టర్ తో పాటుగా, సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో నెల రోజుల పాటు ఇదే పనిపై వివిధ ప్రాంతాల్లో పరిశీలించి కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించాలని అన్నారు. స్కూల్స్ కు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లి దండ్రులకు నచ్చ చెప్పి తిరిగి వారిని పాఠశాలకు పంపే ఏర్పాటు చేసి వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలన్నారు.ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి లేదా పోలీసులకు సమాచారం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉమెన్ అండ్ చైల్డ్ సెక్యూరిటీ వింగ్ ఏసిపి వి. ప్రసన్న కుమార్,రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కే.నరేందర్ రెడ్డి,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రామ్ మోహన్ మేడ్చల్ జిల్లా అందె వెంకటేశ్వర్లు, రాష్ట్ర కో ఆర్డినేటర్, బచపన్ భచావో ఆంధోలన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఎండి ఇంతియాజ్ రహీమ్,మేడ్చల్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రత్నం, సంగారెడ్డి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ప్రవీణ్ కుమార్, రంగారెడ్డి జిల్లా బాలల సంరక్షణ అధికారి, దేవేంద్ర చారి,జి. వీరేశం, అసిస్ట్ లేబర్ ఆఫీసర్,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.రవీందర్ రెడ్డి,మేడ్చల్ జిల్లా జేమ్స్ బాబు, పోలీస్ ఇన్స్పెక్టర్,ఏ హెచ్ టి యు సైబరాబాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# 'తుర్కయంజాల్‌కు త్వరలో మహర్ధశ'

- **రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి**

**తుర్కయంజాల్, విశాలభారతి:**

సీఎం రేవంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో వచ్చే మూడు నెలల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ రూపురేఖలు మారబోతున్నాయని, అభివృద్ధికి చిరునామాగా నిలబోతున్నామని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. తొర్రూరులోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో చైర్ పర్సన్ అనురాధ అధ్యక్షతన పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంరెడ్డి మాట్లాడుతూ తుర్కయంజాల్‌కు త్వరలోనే మహర్ధశ పట్టనుందని పేర్కొన్నారు. 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ జనసాంద్రత పెరుగుతున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. రూ.80లక్షల నిధులతో పార్క్ స్థలాలకు ఫెన్సింగ్ వేయిస్తామన్నారు. రూ.3.75కోట్ల నిధులతో అన్ని వార్డుల్లో యూజీడీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, టాయిలెట్ల నిర్మాణం, ఇతర మరమ్మతులు చేయిస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1. 54కోట్లతో రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు, తాగునీటి సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్, బీజేపీ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్‌కుమార్, కౌన్సిలర్లు నక్క శివలింగంగౌడ్, కాకుమాను సునీల్, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, పుల్లగుర్రం కీర్తనా విజయానంద్‌రెడ్డి, వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, జ్యోతిజంగయ్య, బొక్క శ్రీలత గౌతమ్‌రెడ్డి, కంబాలపల్లి ధన్‌రాజ్, మేతరి అనురాధ దర్శన్, రేవల్లె హరితాయాదగిరి, కొండ్రు మల్లేశ్, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, డీఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్, ఆర్వో శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో ఎదురు గాలులు

- **ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక తో బగ్గుమన్న అంతర గొడవలు**
- **అధికారం కోసం కష్టపడిన పార్టీ శ్రేణులకు దక్కని గౌరవం**
- **ఎమ్మెల్యే తీరుపై అధిష్టానం సీరియస్**

**మణుగూరు, విశాలభారతి:**

కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తవుతున్న పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉంది అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. కాంగ్రెస్ పార్టీ కోసం కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి గెలిపించుకున్న నికార్సేన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందంటూ పినపాక నియోజకవర్గంలో బహిరంగం గానే చర్చ జరుగుతుంది.పార్టీ నమ్మిన వారిని కాదని అధికారం కోసం వచ్చిన వారికి ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి ప్రారంభోత్సవంలోనూ పార్టీ అంతర్గత కమిటీ సభ్యులు ఎంపికల్లోనూ ఎమ్మెల్యే తన కొరియర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ కొంతమంది సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగానే తమ వ్యతిరేకతను తెలియజేస్తున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం కమిటీలను వేయవలసిందిగా కోరగా ఎమ్మెల్యే అనుచర వర్గానికి పెద్దపీట వేస్తూ పార్టీ కోసం కష్టపడే వారిని కాదని వారికే ప్రాముఖ్యత కల్పించారని నియోజకవర్గంగా కాంగ్రెస్ పార్టీలో పెద్ద అంతర్గత యుద్ధమే జరిగిందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఏర్పాటుతో కాంగ్రెస్ పార్టీకి అభిమానులుగా ఉన్న కార్యకర్తలు అందరూ తమ వ్యతిరేక శైలిని బలంగా వినిపించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు గా అన్నిచోట్ల నిలబడి తమ ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చర్చించుకున్నట్లు సమాచారం.అదే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేపట్టిన సర్వేలోనూ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తితో ఉన్నట్లు చర్చ నడుస్తోంది.



# కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- **బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సోమారపు రాజయ్య**

**సైదాపూర్ విశాల భారతి**

ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సోమవారం రాజయ్య డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం పై రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాక్యాలను నిరసిస్తూ సోమవారం కొత్త బస్టాండ్ రహదారిపై రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. సోమారపు రాజయ్య మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా నిధులు విడుదల చేయలేదన్నారు. యాసంగి సీజన్ వరకు వివరాలు సేకరించి రైతు భరోసా అందిస్తామని మంత్రి ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఫీజు రియంబర్స్మెంట్ ,ఆర్టిసి వీలీనం, ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి ఇలా అన్ని సంక్షేమ పథకాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని పేర్కొన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. పర్యటనలతో హడావిడి చేయడం అవసరం లేదని ఎద్దేవా చేశారు. ఏజెన్సీ ప్రాంతాలలో ప్రజలకు పూర్తిగా ఇందిరమ్మ ఇల్లు ఇస్తామంటూ ప్రత్యేక కమిటీలు వేయడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రావుల శ్రీధర్ రెడ్డి,ఎలకపల్లి రవీందర్, పైడిపల్లి రవీందర్ గౌడ్,శంకర్ నాయక్,వర్నె మోహన్ రావు,ఎస్కె ఐలయ్య,రజినీకాంత్,శ్రీనివాస్,కొమురయ్య,రమణాచారి తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూములను కాపాడండి

- **అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలి**
- **జిల్లా సహాయ కార్యదర్శి డి దామోదర్ రెడ్డి, ఉమామహేష్,**

**మేడిపల్లి,విశాలభారతి:**

మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరానగర్ కాలనీలో సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమమునకు అధ్యక్షతన కె ప్రమీల జరగగా అతిథులుగా మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శిలు డి దామోదర్ రెడ్డి, ఉమామహేష్ పాల్గొని మాట్లాడుతూ మేడిపల్లి మండలంలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, ప్రభుత్వ భూములు భూకబ్జాదారులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే చర్యలు తీసుకోవాలని భూకబ్జాదారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలామంది ప్రజా పాలనలో అప్లై చేసుకున్న కొంతమందిని గుర్తించడం వలన పేదలకు అన్యాయం జరుగుతుందని. మరల ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని మరల పరిశీలించి లబ్ధిదారులను కంప్యూటర్ ఫీడ్ చేయాలని కోరారు. జంట కార్పొరేషన్ లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న కార్పొరేషన్ కమిషనర్లు చూసిచూరినట్టు వదిలేయడంతో కార్పొరేషన్ కి భారీ ఆదాయం గండి పడుతుందని వెంటనే ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. చర్యలు తీసుకొని ఎడల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేయడం జరుగుతుందని హెచ్చరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి జె లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు వి బి బాలరాజ్, బాపరాజు, సిహెచ్ మాధవి, కే మహాలక్ష్మి, దండు రమేష్, బి ఐలయ్య, కొమురయ్య, ఎండి అన్వర్, జి నాగరాజు, కనకయ్య, ఇస్తారు, సోమరాజు , బొందయ్య,మహేశ్వరి, జ్యోతి, పి ఆండాలు, భూతం నరేష్, దండు మదర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రూ.1.52 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు కాల్చివేత

- **520 కిలోల ఎండు గంజాయి, 3.6 కిలోల ఆల్ఫాజోలం ధ్వంసం**

**బాల్కొండ, విశాల భారతి**

వివిధ కేసుల్లో పట్టుకున్న ఎండు గంజాయిని, ఆల్ఫాజోలంను కాల్చి ధ్వంసం చేసినట్లు భీమ్‌గల్ అబ్కారి శాఖ సిఐ వేణు మాధవ్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. అబ్కారి శాఖ సిఐ వేణు మాధవ్ రావు తెలిపిన వివరాలు.. నిజామాబాద్ జిల్లా అబ్కారి శాఖ పరిధిలోని వివిధ మండలాల్లో పట్టుకున్న రూ.1.52 కోట్ల విలువైన ఎండు గంజాయితో పాటు ఆల్ఫాజోలంను కాల్చి ధ్వంసం చేశామని తెలిపారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యుడు కే.మల్లారెడ్డి ఆధ్వర్యంలో జక్రాన్ పల్లి మండలం పడ్ కల్ గ్రామంలోని మెడికేర్ సర్వీస్ ఫ్యాక్టరీలో వివిధ కేసుల్లో లభ్యమైన ఎండు గంజాయి బోధన్ స్టేషన్ పరిధిలో 300 కిలోలు, భీమ్‌గల్ స్టేషన్ పరిధిలో 3.67 కిలోలు, మోర్తాడ్ స్టేషన్ పరిధిలో 2.1 కిలోలు, ఆర్మూర్ స్టేషన్ పరిధిలో రెండు కిలోలు, నిజామాబాద్ స్టేషన్ పరిధిలో 220కిలోలతో పాటుగా 3.6 కిలోల ఆల్ఫాజోలంను కాల్చి ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ టీం సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
07.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## డీసీఎం ఢీకొనడంతో వ్యక్తి మృతి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి;**

నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చి డీసీఎం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ మధు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ షేరిగూడలోని మల్లికార్జున కోళ్ల ఫీడింగ్ మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన ఆకాష్ (25) గత సంవత్సరం నుండి మిల్లులో కూలీ గా పనిచేస్తున్నాడు. మిల్లు నుండి బయటకు నడుచుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో ఎదురుగా వచ్చిన డీసీఎం ఆకాష్‌ను ఢీ కొట్టడంతో వాహనం టైర్ క్రిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## పూర్తి పారదర్శకతతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టారని, పూర్తి పారదర్శకతతో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో.. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఇందిరమ్మ నమూనా గృహ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత స్థలం కలిగి ఉన్న నిరుపేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు ఐదు లక్షల రూపాయల సహాయం అందించనున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటి సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మూడు విడతల్లో లబ్ధిదారుడికి నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ హౌసింగ్ పీడీ చలపతిరావు, ఎంపీడీవో యాదగిరి, డిఈ రవీందర్, ఏఈ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, విజిలెన్స్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతో విద్యార్థిని మృతి

- అగస్త్య ఇంటర్ కళాశాల యాజమాన్యం వైఖరిపట్ల సోని కుటుంబ సభ్యులు ఆవేదన
- ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**






అగస్త్య ఇంటర్ కళాశాల యాజమాన్య నిర్లక్ష్యంతో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న మైలపాకం సోని (19) మరణించిన సంఘటన సోమవారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు , పోలీసులు కథనం ప్రకారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని అగస్త్య ఇంటర్ కార్పొరేట్ కళాశాల హాస్టల్లో నల్గొండ జిల్లాకు చెందిన సోని బైపీసీ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటుంది. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో కళాశాల యాజమాన్యంకు చెప్పగా స్థానికంగా ఉన్న మందులను అందజేసినప్పటికీ తన ఆరోగ్య సమస్య సరికాలేదు. అయినప్పటికీ విద్యార్థిని తల్లి దండ్రులకు సమాచారం చేరవేయకుండా ఆస్పత్రికి సైతం తీసుకు వెళ్లకపోవడంతో విద్యార్థిని ఆరోగ్యానికి క్షీణించింది. చివరికి ఆదివారం మాన్నెగూడ లో ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థిని మృతదేహం ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయంపై ఆదిబట్ల పోలీస్ స్టేషన్ లో విద్యార్థిని బంధువులు ఫిర్యాదు చేసినట్లు చేశారు. విద్యార్థిని అనారోగ్యం పాలు కాగా ఆసుపత్రికి తరలించి నప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## ఘనంగా పోచారం మల్లన్న జాతర

- పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవభక్తిని పెంపొందించుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం పోచారం గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం జాతర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బిక్షపతి, రాజు, నర్రా బిక్షపతి, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



## రేవంత్ మాటలు కోటలు దాటుతున్నాయి

**పాలకీడు, విశాలభారతి:**

మండల కేంద్రంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం వద్దే సైదయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆయన విమర్శించారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వల్ల నేడు దళిత బడుగు బలహీన వర్గాలు వారు హక్కులతో అనుభవిస్తున్నారని, చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఆయన అన్నారు.అంబేద్కర్ను పదేపదే జపించడం కంటే దేవుని ప్రార్థించడం వల్ల స్వర్గం వెళ్తారని అమిత్ షా వాక్యానించడం ఆయన దివాలా కోరుతనానికి,మతోన్మాదానికి నిదర్శనమని ఆయన అన్నారు. రాజ్యాంగమును ధ్వంసం చేసే కుట్రలో లో భాగమే అమిత్యా వ్యాఖ్యలని రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలుపరిచే విధంగా బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని ,వారి ప్రయత్నాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జాప్యం చేయడం అన్యాయం ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని, ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగదని హితువు పలికారు. సమావేశంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్,మండల నాయకులు, మాజీ సర్పంచ్ గుర్రం ధన మూర్తి, మాజీ ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, ఎర్ర మల్లా రెడ్డి, వద్దే సైదయ్య,ఆర్లపూడి వీరభద్రం, మాతంగి ఏసురత్నం, నన్నే పంగ రమేష్,పరంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## అధికారులు సమన్వయంతో పని చేయాలి

- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, విశాలభారతి:**

మండలంలోని తోగ్గూడెం గ్రామపంచాయితీ పరిధిలోని పంచాయితీ కార్యాలయంలో సోమవారం నాడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుని అన్ని శాఖల అధికారులతో మాట్లాడి గ్రామస్తుల సమస్యలను పరిష్కరించారు. వివిధ శాఖలతో అధికారులతో కలిసి ఒకరికొకరు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు డ్రైనేజీ, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, చెరువులను కాపాడాలని, ఆధునీకరించాలని,తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి. ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి ప్రభుత్వ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్ గారు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్న స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- ఘనంగా పోచారం మల్లికార్జున స్వామి జాతర

**పటాన్ చెరు,విశాలభారతి**

మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ జాతరలు ఉత్సవాలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు ప్రజలంతా ఐక్యమత్యంగా కలిసి ఉంటారన్నారు. ఆ మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, కిష్టయ్య, నాగభూషణం, మల్లేష్, సత్తయ్య, దేవరాజ్, రవి,భద్రయ్య, నవీన్, మధు, ప్రవీణ్, జాతర నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయండి

- కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్ చౌహాన్ కు వినతి

**శేరిలింగంపల్లి,విశాలభారతి;**

శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని హైదర్ నగర్ బస్టాప్ లో ఏర్పాటు చేసిన సిగ్నల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎండి ఫయాజ్ కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్ చౌహాన్ ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదర్నగర్ డివిజన్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలతో పాటు ఆసుపత్రులు, సినిమా థియేటర్లతో హైదర్ నగర్ లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయిందని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం రోడ్డు దాటేందుకు వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. గతంలో స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు,వృద్ధులు,దివ్యాంగులు, మహిళలు,రోడ్డు దాటేందుకు జంకుతున్నారన్నారు. పలువురు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటనలు అనేకమని, అలాగే పలువురు మృత్యువాత పడిన విషయాన్ని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు ఎండి ఫయాజ్ తెలిపారు.



## ట్రాఫిక్ నియమ నిబంధనల అవగాహన సదస్సు

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు చౌటుప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ యాదయ్య ట్రాఫిక్ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధన గురించి వివరించారు. తదనంతరం వారు మాట్లాడుతూ మైనర్లు బైక్ రైడ్ చేయవద్దని అన్నారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్ ను విధిగా పాటించాలని మరియు రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయరాదు అని ఆయన చెప్పారు. విద్యార్థులకు మీ తల్లిదండ్రులు మీ పుట్టిన రోజు సందర్భంగా మీకు కేక్ కట్ చేయిస్తారు. అలాగే నూతన వస్త్రాలు తెస్తారు మీరు మీ డాడీ కి మీ బర్త్ డే గిఫ్ట్ గా హెల్మెట్ కొని ఇవ్వాలని చెప్పారు. అలాగే కార్లో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు విధిగా సీట్ బెల్ట్ ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ వై రామ్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ డి జైపాల్ రెడ్డి, కానిస్టేబుల్ వెంకటేష్, ట్రినిటీ స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ మంజుల మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## వాసవి వనిత క్లబ్బుల సభ్యత సేకరణ

**నేరేడుచర్ల, విశాలభారతి:**

నేరేడుచర్లలోని వాసవి వనిత క్లబ్బులు సోమవారం సభ్యత సేకరణను ప్రారంభించారు. స్థానిక అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సభ్యత సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్,వాసవి క్లబ్బు అధ్యక్షుడు ఈగ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏకే సుమంత్, కోశాధికారి నకిరేకంటి వంశీ,వనిత క్లబ్ అధ్యక్షురాలు కట్టమూరి విజయ, ప్రధాన కార్యదర్శి గరిణె జ్యోతి, కోశాధికారి చెరుకు కవిత, మాజీ అధ్యక్షులు గోళ్ళ సుధాకర్, కందిబండ శ్రీనివాసరావు, ఊటుకూరి నటరాజ్. గెల్లి లక్ష్మీనరసింహారావు,వాసవి క్లబ్ సభ్యులు పోలిశెట్టి వెంకటేశ్వర్లు, మాశెట్టి సైదయ్య,చందా కిషన్, చెరుకు రాము,వనితా క్లబ్ మాజీ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## నయనతారకు మరో షాక్..



'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ విషయంలో లేడీ సూపర్ స్టార్ నయనతార కు మరో షాక్ తగిలింది. ఇప్పటికే ఈ డాక్యుమెంటరీ విషయంలో నయన్ న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. నయన్ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'నేనూ రౌడీనే' మూవీలోని మూడు సెకండ్ల క్లిప్పింగ్‌ను వాడుకున్నారంటూ తమిళ స్టార్ ధనుష్ రూ.10 కోట్లకు దావా వేశారు. తాజాగా 'చంద్రముఖి' నిర్మాతలు కూడా నయన్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారు. చంద్రముఖి చిత్రంలోని కొన్ని క్లిప్పింగ్స్‌ను అనుమతి లేకుండా డాక్యుమెంటరీలో వాడుకున్నారంటూ చిత్ర నిర్మాతలు నెట్‌ఫ్లిక్స్‌తోపాటు నయన్‌కు నోటీసులు జారీ చేశారు. రూ.5 కోట్లు పరిహారం కింద చెల్లించాలని అందులో డిమాండ్ చేశారు. ఈ నోటీసులపై నయన్ ఇంకా స్పందించలేదు.కాగా, నయన్.. ధనుష్ మధ్య గతకొంత కాలంగా వార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. నయనతార పెళ్లితో పాటు ఆమె జర్నీకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీని రూపొందించింది. ఈ డాక్యుమెంటరీ ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాతగా వ్యవహరించిన 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారు. ఆ క్లిప్పింగ్‌ను డాక్యుమెంటరీలో వాడుకునేందుకు అనుమతి లేకపోవడంతో రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నయనతారకు లీగల్ నోటీసులు కూడా పంపారు. ఈ క్రమంలోనే ధనుష్‌ని లక్ష్యంగా చేసుకొని నయనతార ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. చట్టపరంగా తేల్చుకుంటానని తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఈ వ్యవహారం తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే ధనుష్ కోర్టును ఆశ్రయించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## హాలీవుడ్ స్టైల్‌లో యశ్ బాస్..



కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తర్వాత కన్నడ స్టార్ హీరో యశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం టాక్సిక్ . పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ A Fairy Tale For Grown Ups ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. యశ్ 19వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్ కే నారాయణ తెరకెక్కిస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశాడు యశ్. టాక్సిక్ ఫస్ట్ లుక్‌ను జనవరి 8న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వింటేజ్ టాక్సీ, రౌండప్ క్యాప్ పెట్టుకున్న యశ్ ప్రీ లుక్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. లేడీ సూపర్ స్టార్ నయనతార, బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి, తారా సుటారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.బ్రదర్‌సిస్టర్ కథతో 1970స్ గోవా, కర్ణాటక బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా సాగనుందని ఇన్‌సైడ్ టాక్. కథానుగుణంగా బెంగళూరు, శ్రీలంకలో టాక్సిక్ షూటింగ్ కొనసాగించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ లాంటి గ్లోబల్ బ్లాక్ బస్టర్ ప్రాజెక్టు తర్వాత యశ్ కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

## అజిత్‌కుమార్ వర్సెస్ ప్రభాస్..




బాక్సాఫీస్ వద్ద ఇద్దరు స్టార్ హీరోల మధ్య పోటీ అంటే.. అందులోనా గ్లోబల్ స్టార్‌డమ్ ఉన్న ప్రభాస్ కు దక్షిణాదిన సూపర్ ఫాలోయింగ్ అజిత్‌కుమార్ మధ్య అంటే చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ ఇద్దరు బాక్సాఫీస్ వద్ద ఒకేసారి బరిలోకి దిగుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నారు.అజిత్ కుమార్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి గుడ్ బ్యాడ్ అగ్లీ . అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నాడు. టాలీవుడ్ టాప్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త లుక్ ఒకటి షేర్ చేశారు. కాగా ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్ కూడా ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. గ్లోబల్ స్టార్‌డమ్ ఉన్న ప్రభాస్‌కు ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే అని తెలిసిందే. మరోవైపు అజిత్‌కుమార్‌కు తమిళంలో ఫ్యాన్ బేస్ చాలా ఎక్కువ. ఇక తెలుగులో కూడా గుడ్ బ్యాడ్ అగ్లీని భారీ స్థాయిలో విడుదల చేసే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ సర్కిల్‌లో జోరుగా చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో మరి ప్రభాస్, అజిత్‌కుమార్ మధ్య ఎలాంటి ఫైట్ ఉండబోతున్నదన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## గేమ్ ఛేంజర్‌కు హైలైట్‌గా అప్పన్న, పార్వతి..

### చిట్‌చాట్‌లో అంజలి



గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ గేమ్‌ఛేంజర్. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. గేమ్ ఛేంజర్ జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో చిట్ చాట్ చేసింది అంజలి. గేమ్ ఛేంజర్ సినిమా విశేషాలు అంజలి మాటల్లోనే..

**మీ పాత్ర కోసం ఎలా ప్రిపేర్ అయ్యారు..?**

పార్వతి పాత్ర కోసం ప్రత్యేకం ఏం ప్రిపేర్ కాలేదు. పాత్ర సస్పెన్స్, ట్విస్టులతో సర్‌ప్రైజింగ్‌గా ఉండాలని శంకర్ సార్ కోరుకున్నారు. అందుకే నేను ఎక్కువగా ఆలోచించడం లేదా చెప్పడం మానేశాను. బిగ్ స్క్రీన్‌పై ప్రేక్షకులు తాజా అనుభూతి పొందుతారు. సినిమా పూర్తి చేసిన తర్వాత కూడా ఆ పాత్ర చాలా రోజులపాటు నాతోనే ఉండిపోయింది.

**ఈ పాత్ర కోసం ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు..?**

ఈ పాత్ర ప్రపంచం, అనుభవం నాకు పూర్తిగా కొత్తది. నటులుగా నిజజీవిత పరిస్థితులను ఉదాహరణగా తీసుకుంటాం. కానీ పార్వతి పాత్ర కోసం ఎలాంటి రెఫరెన్స్ తీసుకోలేదు. నా పాత్ర ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఉండేందుకు చాలా కృషి చేయాల్సి వచ్చింది.

**అప్పన్న క్యారెక్టర్ మీ ప్రయాణం గురించి..**

శంకర్ సార్ ఇచ్చిన ఇన్‌పుట్స్ నా పాత్రను అర్థం చేసుకునేందుకు చాలా ఉపయోగపడ్డాయి. అయితే టీజర్, ట్రైలర్‌లో కావాలనే ఈ విషయాన్ని రివీల్ చేయలేదు. అప్పన్న, పార్వతి అనుబంధం సినిమాకు మెయిన్ హైలెట్‌గా నిలువబోతుంది. ప్రేక్షకులు ఖచ్చితంగా వాళ్లిద్దరి కథతో ప్రేమలో పడతారు.

**ఈ సినిమా మీ లైఫ్‌కు గేమ్ ఛేంజర్ అవుతుందా..?**

గేమ్ ఛేంజర్ నాకు చాలా నేర్పించింది. నటనతోపాటు జీవితంపై నా దృక్పథాన్ని మార్చేసింది. పాత్రలు, ప్రాజెక్టులను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసేలా చేసింది. చిరంజీవి నా యాక్టింగ్‌పై ప్రశంసలు కురిపించడం నేనందుకున్న అతిపెద్ద అవార్డ్.

**రాంచరణ్‌తో సాంగ్ గురించి ఏం చెప్తారు..?**

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అరుగు మీద సాంగ్‌ను విడుదల చేశాం. ఇప్పటికే చాలా రీల్స్ ట్రెండింగ్ అవుతున్నాయి. ఇది టీం ఫేవరేట్ సాంగ్ మాత్రమే కాదు.. నాకిష్టమైన వాటిల్లో ఒకటి. థమన్ ఖాతాలో ఇప్పటివరకున్న చాలా హిట్ సాంగ్స్‌లాగే ఇది కూడా చాలా కాలం ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది.

**సంక్రాంతికి మీ రెండు సినిమాలు విడుదలవుతుండటం ఎలా అనిపిస్తుంది..?**

సంక్రాంతికి విడుదలవడం ఏ యాక్టర్‌కైనా ఆశీస్సులాంటిది. తెలుగులో గేమ్ ఛేంజర్, తమిళంలో విశాల్ సినిమా ఉంది. రెండు సినిమాలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ తెచ్చుకుంటాయని ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నా.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.